క్లుప్తంగా

ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన



ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పాలకొల్లు సెంట్రల్: మన పర్యావరణ పరిరక్షణ కొరకు ప్లాస్టిక్ వాడకాలను తగ్గించాలని అలాగే గణపతి నవరాత్రుల ఉత్సవాల్లో మట్టి గణపతులనే వినియోగించి పర్యావరణాన్ని రక్షించుకోవాలని వి.సత్యకృష్ణ కళాజాత బృందం ఆధ్వర్యంలో కళా ప్రదర్శన ద్వారా ప్రజలకు తెలియజేశారు. మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి ఏలూరు, ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో భీమవరం పరిసర ప్రాంతాల్లో మట్టి గణపతుల విశిష్టత తెలిపేలా కళా ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, భీమవరం, ఆచంట ప్రాంతాల్లో ఈ ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపారు.

విజయవాడకు 30 మంది పారిశుద్ధ్య కార్మికులు



విజయవాడకు పారిశుద్ధ్య కార్మికులను తరలిస్తున్న మునిసిపల్ కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: వరద ప్రభావంతో నీట మునిగిన విజయవాడ నగర ప్రాంతానికి పట్టణ మునిసిపల్ కార్యాలయం నుండి 30 మంది శానిటరీ సిబ్బందిని తరలించినట్లు మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి తెలిపారు. మంగళవారం ఉదయం ఓ ప్రైవేటు స్కూల్ బస్సులో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఇద్దరు శానిటరీ మేస్త్రిలు, 30 మంది పారిశుద్ధ్య కార్మికులను పంపించినట్లు తెలిపారు. విజయవాడ చేరుకున్న శానిటరీ సిబ్బందికి ఇంకా డ్యూటీలు వేయలేదని ఓ ప్రైవేటు కళాశాలలో తమకు షెల్టర్ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జీవీ, ఆర్‌ఐ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



సీనియర్ అసిస్టెంట్ షేక్ షరీఫ్‌కు చెక్కు అందిస్తున్న సేవా సంఘ సభ్యులు

పెనుగొండ: వారం రోజులుగా వరదలతో అతలాకుతలమైన పోతున్న బాధితులకు పెనుగొండ మండలం వెంకట్రామపురం గ్రామానికి చెందిన డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మదర్ థెరిస్సా సేవా సంఘ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందించారు. మంగళవారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్ షేక్ షరీఫ్‌కు రూ.ఆరు వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో వీఆర్వో దూసపూడి సత్యనారాయణ, గౌరవ అధ్యక్షుడు బుంగ గణేశ్వరరావు, కార్యదర్శి టి.బుల్లియ్య, ఉపాధ్యక్షుడు సీహెచ్‌రాజు, జాయింట్ సెక్రటరీ ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

74 మందికి కంటి పరీక్షలు



వడలిలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు

పెనుగొండ: వడలి గ్రామ సచివాలయంలో రాజమండ్రికి చెందిన సిద్ధార్థ నర్సింగ్ హోమ్(బుద్ధుడు) కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం ఉదయం డాక్టర్ సజ్జా శ్వేత 74 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. వీరిలో 17 మందికి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి ఉంటుందని సూచించారు. వీరికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

పెనుగొండ: పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలు అభినందనీయులని ఆచంట ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ అన్నారు. మంగళవారం సిద్ధాంతం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు సిద్ధాంతానికి చెందిన దార్లంక మారుతి సూర్య ఘన ప్రసాద్, ఆచంట మందేశ్వరావు రూ.30 వేలు విలువైన రెండు మైక్రోస్కోపులను, 10వ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడానికి బొబ్బిలి శ్రీనివాస్ అందించిన రూ.15 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఉండవల్లి సత్యనారాయణ(చిన్ని), కొండవీటి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

దమ్మయ్యపతి మురుగుకోడు సమస్య తీరేదెన్నడో?



ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయిన దమ్మయ్యపతి మురుగు కోడు



దమ్మయ్యపతి కోడులోకి కలిసే పెనుమదం రోడ్డు డ్రెయినేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు



వర్షం నీటితో మునిగిపోయిన పెదపేట రామాలయం

- ప్లాస్టిక్ వ్యర్థాలతో నిలిచిపోతున్న మురుగు నీరు
- చెరువులు పూడికలతో నిలిచిపోతున్న వర్షం, మురుగు నీరు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో దమ్మయ్యపతి మురుగుకోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. స్థానిక 2వ వార్డు బైపాస్ రోడ్డు వద్ద ప్రారంభమయ్యే దమ్మయ్యపతి మురుగుకోడు వరధనం రోడ్డు వరకూ సుమారు రెండు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పట్టణంలో దాదాపుగా 12 వార్డులకు చెందిన మురుగునీరు ఈ మురుగుకోడులో ప్రవహిస్తుంది. దమ్మయ్యపతి మురుగుకోడును ఎక్కడికక్కడ ఎవరి ఇష్టానుసారం వాళ్లు ఆక్రమించుకోవడంతో కోడు కాస్తా చిన్న సైజు డ్రెనేజీలా మారిపోయింది. దీని ప్రభావం వల్ల పట్టణంలో కొద్దిపాటి వర్షానికే వార్డులు నీటమునిగిపోతున్నాయి. దీనికి తోడు రామయ్యహాలు వద్ద ఉన్న డంపింగ్‌యార్డులో చెత్త అంతా ఈ దమ్మయ్యపతి కోడులోకి జారిపోతుంది. అందువల్ల మురుగునీరు పారక దుర్వాసన పెరిగి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు.

సిల్ట్ తీసినా సమస్యకు పరిష్కారం ఏది?

పట్టణంలో ఎప్పుడు డ్రెయినేజీల్లో సిల్ట్ తీసినా సమస్య తీరడం లేదని ప్రజలు వాపోతున్నారు. మూడు నెలల క్రితం బస్టాండ్ సెంటర్లో ఉన్న ఆక్రమణలను తొలగించి ప్రజలకు తెలియని డ్రెయినేజీని బయటకు తీశారు. అందులో ఉన్న సిల్ట్‌ను తొలగించగా 80 ట్రాక్టర్ల సిల్ట్ రావడం స్థానికులనే కాకుండా పట్టణ ప్రజలను సైతం ఆశ్చర్యానికి గురిచేసింది. అలాగే న్యూ క్లాత్ మార్కెట్ వద్ద కూడా ఎవరికి వారు డ్రెయినేజీపై నిర్మాణాలు పార్కింగ్ ప్లాట్‌ఫారాలు కట్టడంతో డ్రెయినేజీలో సిల్ట్ తీసే పరిస్థితి కనిపించడం లేదు. బస్టాండ్ సెంటర్ కొద్దిపాటి వర్షానికే మోకాలు లోతులో నీరు ఉండేది అలాంటిది ఎంత వర్షం కురిసినా గంటలో నీరు లాగేస్తుండడంతో బస్టాండ్ సెంటర్ వ్యాపారస్తులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. న్యూ క్లాత్ మార్కెట్ డ్రెనేజీలో సిల్ట్ తీయిస్తే పట్టణంలో వర్షం నీరు నిల్వ ఉండే పరిస్థితి ఉండదని ప్రజలు చెబుతున్నారు.

అవుట్‌లెట్ లేకపోవడంతో పొంగుతున్న చెరువులు

కొద్దిపాటి వర్షం వస్తుంటే 16వ వార్డు పెదపేట మోకాలు లోతులో నీట మునిగిపోతుంది. ఎప్పుడు వర్షం వచ్చినా తమ పేట పరిస్థితి ఇలా అధ్వానంగా ఉంటుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పేటకు చేర్చి పరగడ చెరువు ఉంది. ఇది 6 ఎకరాల విస్తీర్ణం ఉన్న చెరువు. ఇందులో 2 ఎకరాలు ప్రైవేటు చెరువు కాగా మిగిలిన 4 ఎకరాలు రెవెన్యూ చెరువు. ఇందులో సుమారు 3 ఎకరాలు వరకూ పూడ్చి వేశారు. ఈ చెరువులోకి సుమారు ఐదు వార్డుల మురుగునీరు చేరుతుంది. దీనికి సరైన అవుట్‌లెట్ లేకపోవడంతో మురుగు నీరుతో పాటు వర్షం నీరు కలిసి లోతట్టు వార్డులను ముంచెత్తుతుంది. దీనివల్ల 16వ వార్డు పెదపేట, సుబ్బారాయుడు గుడి వద్ద కల్వనావారి వీధి, పాత బ్యాంక్ కాలనీ వెనుక పనసరామయ్య తోట, చిత్రావి చెరువు గట్టు ప్రాంతాలు నీట మునిగిపోతున్నాయి. అలాగే 17వ వార్డులో ఉన్న చిత్రావి చెరువుగట్టుకు మరో నాలుగు వార్డులు మురుగునీరు ఈ ప్రాంతంలోకి వచ్చి చేరుతుంది. మార్కెట్ యార్డు నుంచి వచ్చే ఈ మురుగునీరు ఈ చెరువులో చేరుతుంది. గత రెండేళ్ల క్రితం మార్కెట్ యార్డు గోడ పడిపోయి డ్రైనేజీ మొత్తం పూడుకుపోయింది. తద్వారా వర్షం వస్తే మార్కెట్ యార్డు రహదారి, డ్రైనేజీ సమానంగా ఉంటుంది. చిత్రావిచెరువు గట్టు నుంచి అవుట్ లెట్ పూడ్చి వేయడంతో మురుగునీరు వెళ్లే మార్గం లేక చెరువులోకి నీరు వెళ్లి చెరువు చుట్టూ ఉన్న ప్రాంతం మునుగుతుంది. పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న బెజవాడ కోడు పూడుకుపోవడంతో హౌసింగ్ బోర్డు, హరిరామ జోగయ్య కాలని, కొత్తపేట ప్రాంతాలు నీట మునిగేవి. ఇటీవల బెజవాడ కోడులో సిల్ట్ తీయించడంతో ఆ ప్రాంత ప్రజలు కొంతవరకూ ఊపిరిపీల్చుకుంటున్నారు. అలాగే హౌసింగ్ బోర్డు కాలనీ, లయపతిరాయ్‌పేట కాలనీ ప్రాంతాలు నీట మునగడంతో వర్షం నీటిని అధికారులు మోటర్లు వేసి తోడిస్తున్నారు.

పట్టణంలో ప్రధాన సమస్య దమ్మయ్యపతి కోడు

పట్టణంలో ఉన్న దమ్మయ్యపతి మురుగుకోడు పనులు చేపట్టడానికి 2016లో సుమారు రూ. 9 కోట్లు నిధులు మంజూరు చేశారు. మురుగుకోడుకు ఇరువైపులా సైడ్ వాల్ నిర్మాణం, కింద ఫ్లోరింగ్ చేయడానికి టెండర్ పిలిచారు. 2 కిలోమీటర్లు మేర ఉన్న ఈ మురుగుకోడు ఆక్రమణలకు గురికావడంతో కాంట్రాక్టర్లు ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ పనులు చేపట్టారు. దానితో సుమారు 1100 మీటర్లు వరకూ ఈ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు చేయడానికి గత టీడీపీ ప్రభుత్వంలో ఓ కాంట్రాక్టర్ ముందుకు రాగా సగం పనులు పూర్తయ్యాక స్థానిక శాసన సభ్యుడితో 20 శాతం కమీషన్ల ఆరోపణలు రావడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి లీగల్ సమస్యలు తలెత్తడంతో మళ్లీ ఈ పనులు ప్రారంభం కాలేదు. అయితే నెల రోజులు క్రితం మున్సిపల్ కమిషనర్ గుర్రపు డెక్క, సిల్ట్ తీయించారు.

ఎప్పటికప్పుడు సిల్ట్ తీయిస్తున్నాం



ఇప్పటికే మూడు పర్యాయాలు దమ్మయ్యపతి మురుగుకోడులో సిల్ట్ తీయించాం. ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుపడడంతో మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల బెజవాడకోడు, బస్టాండ్ సెంటర్, లజపతిరాయ్‌పేట ప్రాంతాల్లో ప్రధాన డ్రెయినేజీల్లో సిల్ట్ తీయించాం. తద్వారా పట్టణంలో సుమారు సగం వార్డుల్లో సమస్య పరిష్కారం అయ్యింది. మిగిలిన వార్డుల్లో ఇప్పుడు వర్షం కురుస్తుండడం వల్ల సమస్య ఎక్కడ ఉందో పర్యవేక్షిస్తాం.

– విజయసారథి,
మునిసిపల్ కమిషనర్, పాలకొల్లు

జ్వరాలపై సర్వే సక్రమంగా నిర్వర్తించాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందిని ప్రశ్నిస్తున్న జిల్లా వైద్యాధికారి డా.మహేశ్వరరావు

పాలకొల్లు అర్బన్: డెంగీ లక్షణాలతో ఉన్న అనుమానిత రోగులను డెంగీ కిట్ల ద్వారా ఎంఎల్‌హెచ్‌పీలు పరీక్షలు చేసి పాజిటివ్‌గా గుర్తిస్తే మేక్ ఎలీసా పరీక్షల కోసం తణుకు ప్రభుత్వాసుపత్రికి పంపించాలని జిల్లా వైద్యాధికారి డి.మహేశ్వరరావు సూచించారు. మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని అన్ని వార్డులను పరిశీలించారు. మందుల స్టాక్ రిజిస్టర్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే జ్వరాలపై క్షేత్రస్థాయిలో సిబ్బంది పారదర్శకంగా సర్వే చేయాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో రోజుకి ఎన్ని జ్వరాల కేసులు నమోదు అవుతున్నాయి? అని ఆరా తీశారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందును కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. అలాగే దోమల ద్వారా వచ్చే వ్యాధులపై, కలుషితమైన నీటి ద్వారా వచ్చే వ్యాధులపైనా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. దోమల నివారణకు ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహించి ఇంటి పరిసరాల్లో దోమలు లేకుండా చూసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్, డాక్టర్ ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మాసిస్టు పీవీ స్వామి, పీహెచ్‌ఎన్ పి.ఎలిజబెత్ పాల్గొన్నారు. అలాగే పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో డా.మహేశ్వరరావు పాల్గొని ఆశలకు పలు సూచనలు చేశారు.

ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలి



వాటర్ వర్క్స్ కార్యాలయంలో ఆలం నిల్వలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్

నరసాపురం: పట్టణవాసులకు శుభ్రమైన రక్షిత మంచినీరు అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మున్సిపల్ అధికారులకు సూచించారు. మంగళవారం శ్రీహరిపేటలోని వాటర్‌వర్క్స్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆలం నిల్వలను పరిశీలించారు. క్లోరినేషన్ పక్రియ ఎలా సాగుతుంది? అనే అంశాన్ని ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధిక వర్షాలు కారణంగా మంచినీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించామని చెప్పారు. ముఖ్యంగా కుళాయిల ద్వారా అందించే మంచినీటి సరఫరా విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు తెలిపామని వివరించారు. వార్డుల్లో ఎక్కడాకూడా పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఆమెవెంట మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, కౌన్సిలర్లు మల్లాడి బుజ్జి, కావలి నాని తదితరులు ఉన్నారు.

విజయవాడకు ఆహార ప్యాకెట్ల సరఫరా



వరద బాధితులకు ఆహార ప్యాకెట్లు తరలిస్తున్న వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ ధర్మమని తహసీల్దార్ వై.దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, శ్రీ జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం 5 వేల ఆహార పొట్లాలను తయారు చేసి విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల విజయవాడ నగర పరిసర ప్రాంతాల ప్రజలు వరదల్లో చిక్కుకున్న విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వ సూచనల మేరకు దాతలు కాస్మో స్పోర్ట్స్ క్లబ్, ఆక్వా సంఘం సభ్యులను కోరగా ఆక్వా సంఘం నుంచి రెండు వేలు, కాస్మో క్లబ్ నుంచి మూడు వేల ఆహార ప్యాకెట్లును అందించారన్నారు. ఈ ఆహార ప్యాకెట్లను తమ రెవెన్యూ సిబ్బంది ద్వారా విజయవాడకు తరలించామని తెలిపారు. కాస్మో స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, సెక్రటరీ సోమరాజు, ఆక్వా సంఘం సెక్రటరీ బోణం చినబాబు, రుద్రరాజు సత్యనారాయణరాజు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బూస్‌రాజు, సీఎస్ డీటీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ధర్మాదాయ శాఖ నుంచి

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పాలకొల్లు నుంచి 8 వేలు విజిటబుల్ బిర్యానీ ప్యాకెట్లు తయారు చేసి విజయవాడకు తరలించినట్లు సీఎస్ డీటీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం 5 వేలు సాయంత్రం 3 వేల ప్యాకెట్లను తరలించామన్నారు. ఆహార ప్యాకెట్లను తరలిస్తున్న వ్యాన్‌లో వరద బాధితులకు పంపిణీ కోసం వీఆర్ఓలు కూడా తరలి వెళ్లారన్నారు.

పెనుగొండ శ్మశానవాటిక అధ్వానం



గుబురు పొదలతో నిండిన పెనుగొండ శ్మశానవాటికను చూపుతున్న సీపీఎం నాయకులు

పెనుగొండ: పెనుగొండ శ్మశానవాటిక అధ్వానంగా తయారవడంతో అంత్యక్రియలకును నానా అవస్థలు పడుతున్నారని సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం విలేకరులకు పెనుగొండ శ్మశాన వాటిక దుస్థితిని వివరించారు. 25 వేల జనాభాఉన్న పెనుగొండలో శ్మశానవాటిక దారుణంగా ఉందన్నారు. చనిపోయిన వ్యక్తికి ఖననం చేయడానికి సరైన స్థలం లేక దారి పక్కనే పూడ్చాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సిద్ధాంతానికి వెళ్లి దహన సంస్కారాలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అధికారులు స్పందించి శ్మశానంలో పెరిగిపోయిన చెట్లను, గుబురు పొదలను తొలగించి ఆఖరి మజిలీకి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం

నరసాపురం: పట్టణంలోని అశ్విని ఆసుపత్రిలో బుధవారం రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు గ్రంధి విజయలక్ష్మి, సత్యనారాయణ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, గైనకాలజిస్ట్ సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మాదంశెట్టి పద్మావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. 30 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలు ఉచితంగా పరీక్షలు చేయించుకోవచ్చని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ బిల్లు రీడర్ల నిరసన

పాలకొల్లు అర్బన్: ఎలక్ట్రికల్ బిల్లు రీడర్ల శ్రమను దోపిడీ చేస్తున్న ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని యాళ్లవానిగరువు ఎలక్ట్రికల్ ఈఈఆర్వో కార్యాలయం వద్ద ఎలక్ట్రికల్ రీడర్లు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీఓ 3780 మేరకు తమ జీతాలను వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కె.శేఖర్, ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, కార్యదర్శి పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాల పరిశీలన

పాలకొల్లు అర్బన్: అధిక వర్షాల కారణంగా నీట మునిగిన వరి పొలాలను వ్యవసాయాధికారులు మంగళవారం పరిశీలించారు. మండలంలోని ఆగర్రు, ఆగర్తిపాలెం, దిగమర్రు, లంకలకోడేరు, వెలివెల, శివదేవునిచిక్కాల గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. పిలకలు కట్టే దశలో ఉన్న ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, పీఎల్‌ఏ 1100 రకాలు సుమారు 5 నుంచి 6 రోజుల వరకు ముంపునకు తట్టుకుంటాయన్నారు. ముంపునకు కొద్ది రోజుల ముందు రసాయనిక ఎరువులు వేసిన పొలాలు త్వరగా కుళ్లిపోయి నష్టం ఎక్కువగా ఉంటుందని రైతులకు వివరించారు. నీరు బయటకు తీసిన తరువాత బూస్టర్ డోస్ వేసుకోవడం వల్ల మొక్క ముంపు ప్రభావం నుంచి త్వరగా కోలుకుంటుందన్నారు. అధిక వర్షాల వల్ల బాక్టీరియా ఎండాకు తెగులు, ఆకుముడత తెగులు పంటను ఆశిస్తుందన్నారు. డ్రోన్‌ల ద్వారా పురుగు మందులు పిచికారీ చేసుకుని సమయం, ఖర్చు ఆదా అవుతాయన్నారు. ఏడీఏ అద్దాల పార్వతి, ఏవో కె రాజశేఖర్, ఏఈవోలు పాల్గొన్నారు.

యలమంచిలిలో..

యలమంచిలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి చేలన్నీ ముంపు బారిన పడ్డాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ముంపు నుంచి బయటపడిన వరి చేలను వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. ముఖ్యంగా ఈ సార్వా పంటకు యలమంచిలి మండలంలో 3542 ఎకరాలలో వరి సాగు చేయగా భారీ వర్షాలకు 1166 ఎకరాలలో వరి పంట మునకకు గురైందని, ముంపునకు గురైన చేల రైతులు ప్రత్యేక పద్ధతుల ద్వారా తమ చేలను రక్షించుకోవాలని కోరారు.

జనగణన, కులగణన చేశాకే ఎస్సీ వర్గీకరణ చేయాలి

పాలకొల్లు అర్బన్: జనగణన, కులగణన చేయకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమిస్తామని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డా.చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. పాలకొల్లు హౌసింగ్‌బోర్డులోని మాలమహానాడు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్లను 341 అధికరణ ప్రకారం రాజ్యాంగ సవరణ జరగకుండా ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు విడదీయడం, కలిపే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వాలు రిజర్వేషన్ వర్గీకరించాలని ముందుకు వస్తే దేశ వ్యాప్తంగా జనగణన, కులగణన చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సోడదాసి జయపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు మానుకొండ శ్రీనుబాబు, బొంద మోహన్‌రావు, కోట రత్నరాజు, బి.సునీల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి తులసీ దళార్చన

పెనుగొండ: సిద్ధాంతంలోని శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో తులసీ దళార్చన, సుదర్శన లక్ష్మీనారాయణ హోమం కన్నుల పండువగా నిర్వహించారు. శ్రీలక్ష్మీ హయగ్రీవ వికనోమునీంద్ర జయంత్యుత్సవాలు సందర్భంగా వైఖానస్ యూత్ ఆరు మండలాల కార్యవర్గంతో మంగళవారం ఉదయం నుంచి వేంకటేశ్వర స్వామికి అర్చనలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బొక్కా నాగిశెట్టి నాగమణిల కుటుంబ సభ్యుల ద్వారా ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో ఖండవిల్లి సూర్యనారాయణ హోమాలు నిర్వహించారు. అనంతరం మహర్షి నివేదన, నీరాజనం, మంత్ర పుష్పాలు భగవత్ ఆరాధన నిర్వహించిన వైఖానస సభ నిర్వహించారు. కార్యక్రమంలో పెనుగొండ వైఖానస యూత్ ఆరు మండలాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలకు అనుగుణంగా గణపతి నవరాత్రులు



సమావేశంలో పాల్గొన్న ధర్మపరిరక్షణ సమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: గణపతి నవరాత్రులు సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసే గణపతి మండపాలను ఉత్సవ కమిటీ సభ్యులు నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని పట్టణ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు గాదె వెంకన్న సూచించారు. మంగళవారం స్థానిక బ్రాడీపేట లక్ష్మీగణపతి ఆలయంలో ధర్మపరిరక్షణ సమితి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ శనివారం వినాయక చవితి సందర్భంగా గణపతి ఉత్సవాలు ప్రారంభమవుతాయని అన్నారు. పట్టణంలో ప్రధాన కూడళ్లలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటుచేయనున్న మండపాలను సమితి సభ్యులచే సందవర్శిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి పట్టణంలో ఏర్పాటు చేసిన సుమారు 50 ప్రధాన మండపాల్లో ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్వామివార్లకు లడ్డూ ప్రసాదం అందజేయనున్నట్లు తెలిపారు. ఉత్సవ కమిటీల సభ్యులు ఆ సమయంలో అందుబాటులో ఉండి స్వామివారి లడ్డూలను తీసుకుని నైవేద్యం సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కేవీ కృష్ణవర్మ, జక్కంపూడి కుమార్, ట్రెజరర్ శీరం ఆనందకృష్ణ, రామదాసు, చెరుకూరి శ్రీనివాస్, రెడ్డి, శేఖర్, రెడ్డి చిన్ని, దనాని సూర్యప్రకాష్, జి.అప్పారావు, గుడాల హరిబాబు, పోట్నూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

నరసాపురం: పట్టణంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలను ఏర్పాటు చేసినట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు చెప్పారు. మంగళవారం కమిటీ సమావేశాల నేపథ్యంలో పట్టణంలో విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటి సమావేశాలు మొదటిసారిగా నరసాపురంలో జరుగుతున్నాయన్నారు. గతం నుంచి నరసాపురం సీపీఎంకు మంచి పట్టున్న ప్రాంతమన్నారు. ఈ సమావేశాలకు పార్టీ రాష్ట్రనాయకులతో పాటు కేంద్ర కమిటీ నాయకులు కూడా హాజరవుతున్నారని చెప్పారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

పెనుగొండ: పెనుగొండ శివారు చిన్నంవారిపాలెంలో పేకాడుతున్న ఐదుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పేకాటశిబిరంపై దాడి చేసి నిందితులవద్ద నుంచి రూ.3,060 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.